ప్రజా రిపబ్లిక్ స్పెషల్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No: APTEL/2023/87888
శుక్రవారం
17 అక్టోబర్ 2025

గుజరాత్ మంత్రిగా జడేజా సతీమణి..
ప్రమాణం చేసిన రివాబా

అక్టోబర్ 17, (రిపబ్లిక్ న్యూస్):గుజరాత్‌లో ముఖ్యమంత్రి మినహా మిగిలిన మంత్రులంతా రాజీనామా చేయడంతో శుక్రవారం నూతన క్యాబినెట్ ఏర్పాటైంది. ఈ రోజు మంత్రులుగా ప్రమాణం చేసిన వారిలో క్రికెటర్ రవీంద్ర జడేజా భార్య రివాబా జడేజా కూడా ఉన్నారు. గుజరాత్లోని గాంధీనగర్ లో ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది.

ఛత్తీస్‌గఢ్ పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత ఆశన్న

చర్ల, అక్టోబర్ 17, (రిపబ్లిక్ న్యూస్): మావోయిస్టు అగ్రనేత, పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న అలియాస్ రూపేష్ పోలీసుల ముందు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఆశన్న సహా 208 మంది మావోయిస్టులు ఉన్నారు. మావోయిస్టు చరిత్రలో ఇదే అతిపెద్ద లొంగుబాటు. వారిలో 110 మంది మహిళలు, 98 మంది పురుషులు ఉన్నారు.

153 ఆయుధాలు అప్పగించగా.. వీటిల్లో 19 ఏకే-47 రైఫిళ్లు, 17 ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు, 23 ఇన్సాస్లు, 1 ఇన్సాస్ ఎల్ఎంజీ, 303 రైఫిళ్లు, 11 బీజీఎల్, నాలుగు కార్బైన్లు, 41 బోర్ షాటన్లు, పిస్తోళ్లు ఉన్నాయి. కాసేపట్లో ఛత్తీస్ గఢ్ సీఎం సమక్షంలో ఆశన్నను మీడియా ముందు ప్రవేశపెట్టనున్నారు. మావోయిస్టు పార్టీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ ఆయుధాలను వీడి 60 మంది ఉద్యమ సహచరులతో కలిసి జనజీవన స్రవంతిలో కలిసిన గంటల వ్యవధిలోనే ఆశన్న లొంగుబాటు ప్రకటన వచ్చింది. ఇద్దరు అగ్రనేతలు పోరాటాన్ని వీడటంతో మావోయిస్టు పార్టీకి గట్టి షాక్ తగిలింది. ఆశన్న స్వస్థలం ములుగు జిల్లా వెంకటాపూర్ (రామప్ప) మండలంలోని నర్సింగాపూర్ గ్రామం. నాలుగు దశాబ్దాల క్రితం పీపుల్స్ వార్ ఉద్యమం వైపు ఆకర్షితులయ్యారు. వాసుదేవరావు ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు మండలంలోని లక్ష్మీదేవిపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. అనంతరం అప్పటి హనుమకొండ మండలం కాజీపేటలోని ఫాతిమా స్కూల్లో సెకండరీ విద్యనభ్యసించారు. కాకతీయ వర్సిటీలో డిగ్రీ చదువుతూ రాడికల్ స్టూడెంట్

యూనియన్(ఆర్ఎస్ఈయూ)కు నాయకత్వం వహిస్తూ ఆ తర్వాత పరిణామాల నేపథ్యంలో 25 ఏళ్ల వయసులోనే అజ్ఞాతంలోకి వెళ్లారు. ప్రస్తుతం వాసుదేవరావు వయసు 60 ఏళ్లు పైబడి ఉంటుందని ఇంటెలిజెన్స్ వర్గాలు భావిస్తున్నాయి. కీలక దాడులకు ఆశన్న వ్యూహకర్త. దండకారణ్య సబ్ జోనల్ బ్యూరో కార్యదర్శిగా రూపేశ్ పేరుతో వ్యవహరించిన ఆశన్న.. ఏపీ సీఎం చంద్రబాబు, మాజీ సీఎం నేదురుమల్లి జనార్దనరెడ్డిలపై బాంబులు పేల్చి హత్యాయత్నం, 1999లో ఐపీఎస్ అధికారి ఉమేశ్చంద్ర హత్య, 2000లో నాటి హోంమంత్రి మాధవరెడ్డి హత్య లాంటి ఘటనలకు నేతృత్వం వహించినట్లు చెబుతారు.

ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణం చేసిన జస్టిస్ దోనాడి రమేశ్

అమరావతి, అక్టోబర్ 17, (రిపబ్లిక్ న్యూస్): ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ దోనాడి రమేశ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయించారు.

అలహాబాద్ హైకోర్టు నుంచి జస్టిస్ దోనాడి రమేశ్ తిరిగి ఏపీ హైకోర్టుకు బదిలీపై వచ్చారు. జస్టిస్ దొనాడి రమేశ్ స్వస్థలం ఉమ్మడి చిత్తూరు జిల్లా మదనపల్లె దగ్గర్లోని కమ్మపల్లి. అన్నపూర్ణమ్మ, నారాయణనాయుడు దంపతులకు 1965 జూన్ 27న జన్మించారు. నారాయణనాయుడు పంచాయతీరాజ్ శాఖలో ఇంజినీర్ గా పనిచేశారు. జస్టిస్ రమేశ్ తిరుపతి శ్రీవేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల నుంచి డిగ్రీ పూర్తిచేశారు. నెల్లూరు వీఆర్ లా కళాశాలలో న్యాయశాస్త్రం అభ్యసించారు. ఏపీ బార్ కౌన్సెల్లో 1990లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకుని, హైకోర్టులో ప్రాక్టీసు ప్రారంభించారు. జస్టిస్ పీఎస్ నారాయణ న్యాయవాదిగా ఉన్నప్పుడు ఆయన కార్యాలయంలో జూనియర్ న్యాయవాదిగా చేరి వృత్తి మెలకువలు నేర్చుకున్నారు. 2000 డిసెంబరు నుంచి 2004 వరకు ప్రభుత్వ న్యాయవాది(జీపీ)గా సేవలు అందించారు. ఏపీ సర్వశిక్ష అభియాన్కు స్టాండింగ్ కౌన్సెల్గా 2013 వరకు పనిచేశారు. 2014 నుంచి 2019 వరకు ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎసీపీ)గా బాధ్యతలు నిర్వర్తించారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులై 2020 జనవరి 13న బాధ్యతలు స్వీకరించారు. అలహాబాద్ హైకోర్టుకు బదిలీపై వెళ్లి 2023 జులై 24న బాధ్యతలు తీసుకున్నారు. తాజాగా ఏపీ హైకోర్టుకు బదిలీ అయ్యారు.

భాజపా నేతలు దిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి:భట్టి విక్రమార్క

ఖమ్మం, అక్టోబర్ 17, (రిపబ్లిక్ న్యూస్): బీసీ రిజర్వేషన్ల బిల్లును తెలంగాణ అసెంబ్లీలో ఆమోదించి పంపినా కేంద్రప్రభుత్వం పెండింగ్లో పెట్టిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈ విషయంపై ప్రధానిని కలిసేందుకు సీఎం రేవంత్ లేఖ రాసినా ఆయన సమయమివ్వలేదని చెప్పారు.

ఖమ్మంలో భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. ఈ అంశంలో రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు కిషన్రెడ్డి, బండి సంజయ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్రావు చొరవ తీసుకుని అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని భట్టి విక్రమార్క కోరారు. ప్రధాని సమయం ఇస్తే.. అఖిలపక్షంతో కలిసి వచ్చేందుకు సీఎం రేవంత్ సిద్ధమని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేపట్టిన విషయాన్ని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. బీసీ బిల్లు పార్లమెంట్లో ఆమోదించేందుకు భాజపా ఎందుకు అడ్డుపడుతోందని ఆయన ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల అంశం పై బీసీ సంఘాలు చేపట్టిన తెలంగాణ బంద్ భాజపా వైఖరికి వ్యతిరేకంగా జరుగుతోందన్నారు. దీనికి కాంగ్రెస్ శ్రేణులతో పాటు అందరూ మద్దతు తెలపాలని కోరారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

రెండు వారాలు.. రూ.717 కోట్లు..
ద్వితీయ స్థానంలో 'కాంతార చాప్టర్ 1

కలెక్షన్ల విషయంలో 'కాంతార చాప్టర్ 1' రికార్డులు సృష్టిస్తోంది. తాజాగా మరో మైలురాయిని చేరుకుంది. రెండు వారాల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.717 కోట్లకు పైగా (గ్రాస్) వసూలు చేసినట్టు నిర్మాణ సంస్థ హొంబలే ఫిల్మ్స్ అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టింది. ఇందులో తెలుగు రాష్ట్రాల నుంచి రూ.105 కోట్లకు పైగా రాబట్టినట్టు సినీ వర్గాలు తెలిపాయి. ఇప్పటివరకూ అత్యధిక కలెక్షన్లు రాబట్టిన కన్నడ చిత్రాల జాబితాలో 'కాంతార 1' ప్రస్తుతానికి రెండో స్థానంలో ఉంది. రూ.1200 కోట్లుం కలెక్షన్లతో 'కేజీయఫ్ 2' తొలి స్థానంలో నిలిచింది. 'కాంతార చాప్టర్ 1' ఈనెల 2న విడుదలైన సంగతి తెలిసిందే. రిలీజ్ రోజే అత్యధిక వసూలు (రూ.89 కోట్లుం) చేసిన కన్నడ సినిమాగా నిలిచింది. 24 గంటల్లో.. 'బుక్మై షో'లో 1.28 మిలియన్లకి పైగా టికెట్లు అమ్ముడుపోయాయి. ఈ పోర్టల్ వేదికగా ఈ ఏడాదిలో ఈ రేంజ్లో టికెట్లు సేల్ కావడం విశేషం.

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

రిపబ్లిక్ స్పోర్ట్స్

మేమంతా అల్లాడిపోయాం..
కోహ్లి రన్నింగ్ ఆగలేదు: ఆసీస్ పేసర్



భారత స్టార్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత తొలిసారి బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యారు. ఆస్ట్రేలియా వేదికగా ఆ జట్టుతో తలపడనున్నారు. ఇప్పటికే అక్కడికి చేరుకున్న సీనియర్లు సాధనను ముమ్మరం చేశారు. ఆదివారం నుంచి వన్డే సిరీస్ మొదలుకానుంది. ఈ క్రమంలో విరాట్ కోహ్లి ఫిట్నెస్ గురించి ఆసీస్ వెటరన్ పేసర్ కేన్ రిచర్డ్సన్ ఆసక్తికర విషయాలు గుర్తు చేసుకున్నాడు. మరో నెల రోజుల్లో కోహ్లి 37వ ఏడాదిలోకి అడుగుపెడతాడు. 2017లో కోల్కతా వేదికగా జరిగిన మ్యాచ్లో విరాట్ సూపర్ ఇన్నింగ్స్ ఆసీస్ను ఓడించడంలో కీలక పాత్ర పోషించాడు. అప్పటికీ, ఇప్పటికీ ఫిట్నెస్ విషయంలో కోహ్లిలో పెద్దగా మార్పు లేదని రిచర్డ్సన్ వ్యాఖ్యానించాడు. "నాకు ఇప్పటికీ గుర్తుంది. కోల్కతాలో మ్యాచ్. అక్కడ వాతావరణం చాలా వేడిగా ఉంది. మ్యాథ్యూ వేడ్ కీపింగ్ చేస్తున్నాడు. నేను మైదానంలోకి వచ్చేటప్పటికి అతడు చెమటలు కక్కుతున్నాడు. ప్యాట్ కమిన్స్ కూలర్ బాక్స్ వద్ద కూర్చొని ఉన్నట్లు గుర్తు. అతడికి జంపా డ్రింక్ ఇస్తుండగా.. ఎవరో బౌల్లోకి పరుగెత్తుతున్నారని అన్నా. ప్యాటీ బౌలర్ లోపలికి పరిగెత్తుతున్నాడు అని జంపా కూడా అన్నాడు. అయితే, ప్యాటీ మాత్రం తనకు తెలుసు అన్నట్లుగా కూర్చుండిపోయాడు. అక్కడి వాతావరణం అంత హాట్గా ఉంది. ఆ దెబ్బకు మేమంతా చచ్చిపోతామనిపించింది. కానీ, విరాట్ మాత్రం ఏసీ వేసుకొని ట్రెడ్ మిల్పై పరుగెడుతున్నట్లుగా సింగిల్స్, డబుల్స్ తీస్తూనే ఉన్నాడు. ఒకవేళ మీకు ఏమైనా డౌట్స్ ఉంటే ఆ రోజు వీడియో ఫుటేజీలను చూడండి. ఐస్తో కూడిన నెక్లెస్లు వేసుకున్నట్లు ఉంటారు. అందరి ముఖాలు పాలిపోయి ఉంటాయి. ఎవరూ మాట్లాడుకోలేదు. వికెట్ వచ్చినా సరే పెద్దగా సంబరాలు లేవు. ఎనర్జీనే లేదు. కానీ, విరాట్ కోహ్లి పరిస్థితి భిన్నం. అక్కడి పరిస్థితులు తనను ఏమీ చేయలేవనేలా పరుగులు పెట్టాడు" అని రిచర్డ్సన్ వ్యాఖ్యానించాడు. ఆ మ్యాచ్లో భారత్ 252 పరుగులు చేసింది. విరాట్ కోహ్లి 107 బంతుల్లో 92 పరుగులు చేశాడు. అందులో 60 రన్స్ సింగిల్స్, డబుల్స్ నే రావడం గమనార్హం. చివరికి ఆసీస్ 202 పరుగులకు ఆలౌటైంది.

కామెరూన్ స్థానంలో లబుషేన్

భారత్తో వన్డే సిరీస్కు ముందు ఆస్ట్రేలియాకు ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ ఆల్రౌండర్ కామెరూన్ గ్రీన్ గాయం వల్ల వైదొలిగాడు. అతడి స్థానంలో మార్నస్ లబుషేన్కు అవకాశం కల్పిస్తూ క్రికెట్ ఆస్ట్రేలియా నిర్ణయం తీసుకుంది. తొలుత భారత్తో సిరీస్కు ఎంపిక కాలేని లబుషన్కు గ్రీన్ గైర్హాజరీతో ఛాన్స్ వచ్చింది.

హెూం డేకరేషన్
మొక్కల నుంచి ఫంగస్ తొలగించే పద్ధతులు, చాలా సింపుల్

మొక్కలు పెంచాలి అన్న ఆలోచన ఉండే సరిపోదు.. వాటిని పెంచడం కూడా తెలిసి ఉండాలి. మొక్కలకు సరైన సంరక్షణ లేకపోవడం లేదా అధిక మొత్తం నీరు పోయడం వల్ల వాటికి ఫంగస్ పడుతుంది. దీంతో.. మొక్క మొత్తం పాడవుతుంది.

ఈ రోజుల్లో చాలా మంది గార్డెనింగ్ ఇష్టపడుతున్నారు. చిన్న స్థలం ఉన్నా సరే అక్కడ మొక్కన పెంచుతున్నారు. నగరాల్లో నివసించే ప్రజలు కుండీల్లో మొక్కల్ని నాటుతున్నారు. ఇక, సాధారణంగా గార్డెన్లో పూలు, పండ్లతో పాటు ఇతర గార్డెనింగ్ మొక్కల్ని పెంచుతుంటాం. మన పెరడు లేదా బాల్కనీలో కొన్ని రకాల మొక్కలను పెంచడం ద్వారా శారీరక, మానసిక, ఆరోగ్యపరమైన లాభాల్ని పొందవచ్చు. అయితే, మొక్కలు పెంచాలి అన్న ఆలోచన ఉండే సరిపోదు.. వాటిని పెంచడం కూడా తెలిసి ఉండాలి. మొక్కలకు సరైన సంరక్షణ లేకపోవడం లేదా అధిక మొత్తం నీరు పోయడం వల్ల వాటికి ఫంగస్ పడుతుంది. దీంతో.. మొక్క మొత్తం పాడవుతుంది. కొన్ని సార్లు వాతావరణం వల్ల కూడా మొక్కలకు ఫంగస్ పడుతుంది. ఇది మొక్కల ఆకులు, పై భాగాన్ని దెబ్బతీయడమే కాకుండా మూలాల్ని కూడా నాశనం చేస్తుంది. ఫంగస్ కారణంగా మొక్క చనిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. తెల్ల ఫంగస్ మొక్కల్లో ఎక్కువగా కనిపిస్తుంది. ఇండోర్, పెరట్లో పెంచే మొక్కలు తెల్ల ఫంగస్ వల్ల ఎఫెక్ట్ అవుతాయి. ఈ ఫంగస్ ఒక్కోసారి మొత్తం మొక్కకు పాకి నాశనం చేస్తుంది. అందుకే ఇంట్లో పెంచే మొక్కల్ని ఫంగస్ నుంచి రక్షించుకోవాలి. ఇందుకు కొన్ని చిట్కాలు ఉన్నాయి. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం.

వేప నూనె..

వేప నూనె మొక్కల నుంచి ఫంగస్ను తొలగించడంతో ప్రభావవంతంగా పనిచేస్తుంది. నిజానికి ఇది సహజమైన క్రిమిసంహారకంగా పనిచేస్తుంది. మొక్కలకు దీన్ని వాడటం కోసం.. ముందుగా రెండు లీటర్ల నీటిని తీసుకోండి. ఈ నీటిలో రెండు టీ స్పూన్ల వేప నూనె వేసి బాగా కలపండి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని స్ప్రే బాటిల్లో నింపి ఫంగస్ సోకిన మొక్కపై చల్లాలి. వేప నూనెలో ఉండే గుణాలు.. ఫంగస్తో పోరాడుతాయి. దీంతో.. ఫంగస్ చాలా త్వరగా నశిస్తుంది.

యాపిల్ సైడర్ వెనిగర్..

మొక్కలపై ఫంగస్ను చంపడానికి, ఆకుల నుంచి తెల్లటి మచ్చల్ని తొలగించడానికి యాపిల్ సైడర్ వెనిగర్ బెస్ట్ ఆప్షన్. ఇందుకోసం ఒక లీటర్ నీటిలో రెండు టేబుల్ స్పూన్ల యాపిల్ సైడర్ వెనిగర్ కలపండి. ఈ మిశ్రమాన్ని బాగా కలపండి. తర్వాత ఈ ద్రావణాన్ని ఫంగస్ సోకిన ఆకులు, కాండంపై పిచికారీ చేయాలి. మొక్క నుంచి ఫంగస్ పూర్తిగా తొలిగిపోయే వరకు ఈ రెమెడీని వారానికి రెండు నుంచి మూడు సార్లు ప్రయత్నించండి. ఈ ద్రావణం వల్ల ఫంగస్ పూర్తిగా నాశనమవుతుంది.

బేకింగ్ సోడా..

వంటల్లో ఉపయోగించే బేకింగ్ సోడా మొక్కల నుంచి ఫంగస్ను తొలగించడంలో సాయపడుతుంది. ఇందుకోసం రెండు లీటర్ల నీటిలో సగం టీ స్పూన్ లిక్విడ్ సోప్, ఒక టేబుల్ స్పూన్ బేకింగ్ సోడా కలపండి. ఆ తర్వాత వీటిని బాగా కలిపి ద్రావణాన్ని తయారుచేసుకోండి. ఈ ద్రావణాన్ని వెంటనే వాడకూడదు. ఈ మిశ్రమాన్ని రెండు నుంచి మూడు రోజుల పాటు అలాగే ఉంచండి. తర్వాత ఈ ద్రావణాన్ని స్ప్రే బాటిల్లో తీసుకుని.. ఫంగస్ సోకిన మొక్కలోని ప్రతి భాగానికి పిచికారీ చేయాలి. ఫంగస్ పూర్తిగా తొలిగిపోయే వరకు ఈ మిశ్రమాన్ని ఉపయోగించండి. అయితే, సూర్యకాంతిలో మాత్రం పిచికారీ చేయకండి. సూర్యరశ్మి తక్కువ ఉన్న సమయంలో మాత్రమే మొక్కకు ఈ మిశ్రమాన్ని పిచికారీ చేయాలి.

మౌత్ వాష్..

తెల్లటి ఫంగస్ నుంచి మొక్కలను రక్షించడానికి ఇథనాల్ ఆధారిత మౌత్ వాష్ చాలా మంచి ఎంపిక. ఇందుకోసం ఒక క్యాప్ ఫుల్ మౌత్ వాష్ను లీటర్ నీటిలో కలపండి. ఆ తర్వాత మొక్క ప్రభావిత ప్రాంతాల్లో స్ప్రే చేయాలి. తెల్లటి ఫంగస్కు మౌత్వాష్ ప్రభావవంతమైన నివారణ. అయితే, ఇది కొత్త మొక్కల పెరుగుదలకు మాత్రం హానికరం. అందుకే దీనిని ఎక్కువ మోతాదులో వాడకూడదు. తక్కువ పరిమాణంలో ఉపయోగిస్తే ఫంగస్ నశిస్తుంది.

ఈ విషయాలు కూడా ముఖ్యం..

ఫంగస్ తేమను ఇష్టపడుతుంది. అందుకే మొక్కలు ఎక్కువ తేమలో ఉండకూడదు. నీటిని ఎక్కువ పోయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోండి. అంతేకాకుండా ఉష్ణోగ్రతలు కూడా మొక్కపై ప్రభావం చూపిస్తాయి. ఉష్ణోగ్రతల్ని బట్టి మొక్కను కాపాడుకోండి. మొక్కలు పెరిగే మట్టి పొడిగా ఉన్నప్పుడు మాత్రమే మొక్కలకు నీరు పోయండి. అధిక తేమ ఫంగస్కు కారణమవుతుంది. అందుకే మొక్కలకు ఎక్కువ నీరు పోయకూడదు. మార్కెట్ నుంచి కొత్త మొక్కల్ని తీసుకు వచ్చేటప్పుడు.. వాటిని జాగ్రత్తగా గమనించండి. అవి అప్పటికే ఫంగస్ బారిన పడ్డాయో లేదో చెక్ చేయండి. ఏదైనా ఇంటి చిట్కా పాటించే ముందు.. మొక్క ప్రభావిత భాగానికి కచ్చితంగా ప్యాచ్ టెస్ట్ చేయాలి. గమనిక..ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం.